


'నేనూ శారదా ఒకరినొకరు మొట్ట మొదట చూసుకున్నపుడు గండు కోయిలలు కూసి వుంటాయి. వసంతం ప్రవేశించి వుంటుంది. మన్మథుడు తన చెరుకు విల్లు ఎక్కుపెట్టి పువ్వుల బాణాల్ని మా మీద ప్రయోగించి వుంటాడు. చంద్రుడు పట్ట పగలే ఉదయించి వుంటాడు. చెట్లకు పువ్వులు విరగ బూసి వుంటాయి. కాని అదంతా మాకు తెలియదు. తెలిసిందల్లా బతాసీలూ, వేరుశనగ కాయాలు మరమరాలూ నిండుగా వుండి వాటి మీదకు ఈగలు ముసురుతున్న బంగిడీ, దాని మీద కెగబడి కానీతో అన్నీ కొనేద్దామనే అత్యాశా ఎదురుగా పళ్ళు రాలిపోయి తలనెరిసిపోయి మాసిపోయిన కంపు చీర కట్టుకున్న ముసలి అవ్వా మాత్రమే. అయితే ఇద్దరం ఒక్కసారి బంగిడి మీదకు వంగడం వల్ల తలలు ఢీ కొట్టుకున్నాయి. తలెత్తి చూద్దును కదా, గులాబీరంగు పట్టు పరికిణీ, ఎర్రటి సిల్కు జాకెట్టూ, పచ్చని బుగ్గలూ, కాటుక కళ్ళూ కన్పించాయి. అప్పుడేమనిపించిందో జ్ఞాపకం లేదుగాని, ఇప్పుడు తల్చుకుంటే మాత్రం అదోకలా అయిపోతుంది.''

''అప్పుడు నీ కెన్నేళ్ళు?'' అని అడిగాడు కేశవరావు, ఏదో ఆలోచిస్తున్న వాడిలా.

''ఆ, ఎంత పదేళ్ళు. శారదకి తొమ్మిదేళ్ళుంటాయి.''

''ఆ వయస్సులోనే మీ యిద్దరి మధ్యా ప్రేమ ప్రారంభమైందన్న మాట'' అన్నాడు సిగరెట్టు ముట్టిస్తూ. అతని సవాలుని అంగీకరించే ముందు, కిటికీలోంచి బయటికి ఒకసారి చూసాను. బయట చీకటి ముద్దని వేగంగా వెళ్తున్న రైలు మధ్యకి ముక్కలుగా కోస్తున్నట్లనిపించింది. స్లీపరు కోచిలో నాకూ కేశవరావుకీ ఎదురెదురు సీట్లు లభించాయి. ప్రొద్దున్న విజయనగరంలో పదిగంటల కెక్కాం. బండి చాలా లేటుగా నడుస్తోంది. రాజమండ్రీ దాటేసరికి చీకటిపడిపోయింది. అంతవరకూ లోకాభిరామాయణంలో గడిపిన మేము అప్పటికి ప్రేమాయణంలో పడ్డాం. నేను నా ప్రేమగాథ ముందర మొదలెట్టాను.

నా కెదురుగా వున్న కేశవరావు బెర్తుకి పై బెర్తులో, విశాఖపట్నంలో ఒక ముప్ఫై ఏళ్ళ వ్యక్తి ఎక్కాడు. అసలతన్ని చూసిన దగ్గర్నుంచీ, శారదా కామాక్షమ్మ గారూ, వాళ్ళ కుటుంబం జ్ఞాపకమొచ్చింది. మనసులోని మూగ వీణ తంత్రులెవరో మ్రోయించినట్లైంది.

కేశవరావు వైపు చూసి, ''అంతే అయి వుండాలి.'' అన్నాను. నా మనసులో శారద, ఆ రోజుల్లో పరికిణీ కట్టుకుని ఉండేదల్లా కొద్ది సెకన్లలో పమిటలు వేసుకునే వయస్సులో మెదిలింది. కేశవరావు హోల్డాలు మెల్లిగా పరుచుకొని, పక్క సర్దుకుంటున్నాడు. మాకు అవతలి సీట్లలో ఇద్దరమ్మాయిలు వున్నారు. పగలంతా, వాళ్ళు, కంపార్టుమెంటంతా తిరుగుతూ తెగ అల్లరి చేసారు. ఇద్దరికీ పదిహేను, పదహారేళ్ల వయస్సుంటుంది. అక్కచెల్లెళ్ళలా వున్నారు. అప్పుడు ఇద్దరూ

వృత్తిగా ఏవో పుస్తకాలు చదువుతున్నారు. నా మనసులో శారద గురించి ఆలోచనలు వస్తే అవి నన్ను ఎక్కడికో ఊహాలోకంలోకి తీసుకుపోతాయి. చుట్టూ పరిసరాల్ని ఇట్టే మర్చిపోతాను. అందులోనూ కేశవరావు లాంటి స్నేహితుడుంటే మరీ తొందరగా ముందుకు దూకుతాయి. నాలోని భావ తరంగాలు.

"ప్రేమ ప్రభవం నాపై ప్రసరించిన దగ్గర్నుండి నేనొక నూతన వ్యక్తినై పోయాను. అంతకుముందు నట్టి జడుడిలా వుండేవాణ్ణి. విద్యుద్దీపంలోకి విద్యుత్ ప్రవహించినప్పుడు, అందులోంచి కాంతి ఎలా ప్రసారితమౌతుందో, నాలోంచి చైతన్యం ఉత్సాహం అలా ప్రసరించసాగాయి. నాకు పదహారో ఏడనుకుంటాను, ఒకరోజు శారదను కొత్త రూపంలో చూసాను. అప్పటి నుండి, వికసించిన గులాబీలాంటి ఆమె, రూపం, నా మనసులో మెదులుతూ..."

కేశవరావు విరగబడి నవ్వాడు. "అంటే ప్రేమలో బోర్లా పడ్డానంటావు" అన్నాడు, నా భావవిహంగం యొక్క రెక్కలు నరికేస్తూ. మళ్లీ వెంటనే "అది కాదోయ్, ప్రేమలో పడగానే ఏదో కొంత మునిగినట్లు అలా వర్ణిస్తా వేమిటి?" అన్నాడు, సర్దుకుంటూ.

నాకూ నవ్వొచ్చింది. "నువ్వన్నది నిజమే ననుకో, కాని చివరికి పగిలింది మూతి కాదు. హృదయం! కొన్ని సంవత్సరాలు ఏదో గాలిలో తేలిపోతున్నట్లు గడిపాక, తంగుని గుమ్మం నెత్తికి కొట్టుకున్నట్లు, నాకూ శారదకూ సంబంధం తెగిపోయింది అప్పుడు నేను చాలా విచారించాను."

"కారణం ఏమిటి?"

"కారణం చాలా సూక్ష్మమైంది. నేను బి. ఎస్‌సి. తప్పాను." అన్నాను. నా బి.ఎస్‌సి. తప్పడానికీ, శారద నాది కాకపోడానికీ గల కారణానికీ, సంబంధం ఏమిటో అతనికి బోధపర్చడం కష్టం.

"చాలా ఘోరమైన తప్పే. అయితే, యింతకీ శారదతో తల్లిదండ్రు లిద్దరిలో ఎవరు నిన్ను శారదతో పెళ్లికి అనర్హుడవని నిర్ణయించారు?" అని కేశవరావు అడిగాడు. విషయాన్ని కొంతవరకూ గ్రహించిన వాడిలా.

"వాళ్లమ్మగారు. ఆమెకు నేను చాలా ఆశాభంగం కలిగించాను. అంతవరకూ నేను బి. ఎస్‌సి. పాసయ్యాక మెడిసన్ చదువు తానని అంతా అనుకునేవారు. చదువవల్ల శారదతో నా చనువు ఆ యింట్లో అందరూ అంగీకరించారు. ఎప్పుడైతే బి. ఎస్‌సీ. ఫేలయి నేను చదువు మానేసానో నాకు వాళ్ల దృష్టిలో విలువ తగ్గిపోయింది."

రైలు ఏదో స్టేషనులో ఆగింది. కొందరు ప్రయాణీకులు మా క[illegible]లోకి ఎక్కాలని ప్రయత్నించి విఫలులయ్యారు. జీవితంలో ప్రతి విఫల ప్రయత్నం ఎంతో జాలికరంగా వుంటుంది. ఎంతో ఆశతో వచ్చిన వాళ్లు నిరాశతో వెళ్లిపోవడం కొందరికి వినోదం కల్గించినా కొందరి మనసును కరిగిస్తుంది.

"ఆవిడ చాలా పట్టుదల గల మనిషా?" అని కేశవరావడిగాడు.

"అదే అనుకోవాలి. బహుశా ధనవంతులలో చాలామంది అలాగే వుంటారనుకుంటాను. విచిత్ర మేమిటంటే నాకూ శారదకూ ఏడెనిమిదేళ్ల నుండీ వున్న అనుబంధాన్ని క్షణంలో ఆమె తెంపివెయ్య కలిగింది. అంతవరకూ నన్ను వదిలి వుండలేనే శారద క్రమంగా నన్ను తప్పించుకు తిరగసాగింది. నేను ఎంతో ప్రయత్నించాను, ఆమెను ఒంటరిగా కలుసుకొని మాట్లాడి నా హృదయంలోని ఆవేదన వెళ్లబుచ్చుకుందామని. కాని అవకాశం చిక్కలేదు. మా ప్రేమని అంత త్వరలో కరిగించే శక్తి కామాక్షమ్మగారి మాటలలో వుంది కాబోలు."

"ప్రేమ!" అని పళ్లు పటపట కొరికాడు. "ప్రేమ అనేది కేవలం భ్రమ మాత్రమే. మనం అనుకునే నిజమైన ప్రేమ అసలు లేనే లేదనుకో" అన్నాడు. అతని జీవితంలో ఏ నిగూఢ ప్రేమ రహస్యాలు దాగి వున్నాయో! ప్రేమవలన ఎంత బాధకు లోనుకాకపోతే అసలు ప్రేమే లేదనే నిర్ణయానికి వస్తాడు? అతని మనసులోని బాధను కూడా వెళ్లగక్కించాలనుకున్నాను. నేను మాట్లాడే ముందు అతనే అడిగాడు. "ఆవిడ గురించి చెప్పవినాలని వుంది." అన్నాడు. పడుకున్నవాడల్లా లేచి కూచుని.

"ఆమెకూ మా అమ్మకూ, నాకూ శారదకూ పరిచయం అయిన కొద్ది మాసాలకే పరిచయం అయింది. వాళ్లిద్దరి పరిచయం నాకూ శారదకూ గల స్నేహాన్ని వృద్ధి పొందించటానికి తోడ్పడింది. ఆమెకు మాఅమ్మతో అయినంత స్నేహం ఆవూర్లో మరెవరితోనూ కాలేదు. నిజానికి ఆమె స్నేహం ఎవరూ కోరేవారు కాదు. మాఅమ్మ మాత్రం ఆమెతో స్నేహంగా వుండేది. ఆమె ఎంత విచిత్ర వ్యక్తయినా"

"అంత విచిత్రమేముంది ఆమెలో?"

"అందరూ ఆమెను హర్షించకపోవటానికి కారణం, ఆమె వూరికే తన గురించీ తన కుటుంబం గురించీ తెగగొప్పలు చెప్పుకుంటుందనీ, చాలా ఉద్రేక తత్వం గల మనిషనీ, ప్రతి చిన్న విషయానికీ ఇతరులతో దెబ్బలాడుతుందనీ, మొత్తానికి ప్లీడరు సుదర్శనం గారంటే అందరికీ ఎంత భక్తి శ్రద్ధలున్నాయో, ఆయన భార్య కామాక్షమ్మ గారంటే అంత అసహ్యంగా వుండేది." అని నేనగానే పై బెర్తులో నున్న వ్యక్తి ఉలిక్కిపడి లేచి నా వైపు చూశాడు.

అతన్ని నేనంతగా గమనించలేదు. నా మనసులో కామాక్షమ్మగారి రూపం మెదిలింది. ఆమె పొట్టిగా లావుగా, చామనచాయగా వుండేది. ముఖం విశాలమైనది కళ్లు చిన్నవి. కళ్లజోడు పెట్టుకునేది. ఎప్పుడూ పట్టు చీరలు కట్టుకునేది. ఆమె చూపులో ఎదుటివారిని నిశితంగా పరిశీలించి, అజ్ఞాపించగల శక్తి వుంది. స్వతహాగా ఆమెది నవ్వు ముఖం కాదు. ఆమె నవ్వితే, ముఖంలో ఎంతో మార్పు వస్తుంది. కోపం వస్తే మరీ విపరీతమైన మార్పు కన్పిస్తుంది. నిర్మలమైన ఆకాశం హఠాత్తుగా దట్టమైన మబ్బులతో, ఉరుములతో మెరుపులతో నిండిపోయి ఫెళఫెళ ధ్వనులతో భూమి దద్దరిల్లేట్లు వర్షం కురిపించినట్లు, ఆమెలో ఉద్రేకం పరవళ్లు తొక్కేది. ఆ కోపం ఒకనాడు ఒక ముష్టెత్తుకునే దాని మీద చూపించింది. ఆమెకు బిచ్చం అన్నా, బిచ్చగాళ్లన్నా తగని అసహ్యం. వాళ్ల మీద కోపంతో వళ్లు మర్చిపోయేది. వాళ్లు గనుక ఆమె పొమ్మన్న వెంటనే పోకపోతే ఏదైనా కర్రతో వాళ్లని కొట్టడానికి సిద్ధపడేది. మళ్లీ ఒకొక్కప్పుడు బీదతనం అంటే ఎంతో విచారం ప్రకటించేది. తనకి బీదతనం అంటే


ఏమిటో తెలియక వాళ్లని అసహ్యించుకుంటున్నానని చెప్పుకునేది. ఎన్నోతరాల నుండి ఆమె పుట్టింటి వారు భాగ్యవంతులు. అగర్భ శ్రీమంతుల కూతురైన తను దారిద్ర్యం చూసి సహించకపోవడంలో వింతేమీ లేదని ఆమె అంటూండేది. "అబ్బ ఈ దరిద్రుల్ని చూస్తే నాకు వళ్లుమంట. ప్రభుత్వం వీళ్లనందరినీ ఏ అడవిలోకైనా తీసికెళ్లి వదిలేస్తే బాగుండును. వీళ్ల వలన ఎంత ప్రమాదమని! ఈ ముష్టెత్తే వాళ్లే దొంగతనాలు చేసేది" అని వాళ్ల గురించి తెగ విసుక్కునేది.

కేశవరావు అంతతో వూరుకోలేదు. "ప్రతిమనిషికీ తన గురించి ఇతరులకు చెప్పుకోవాలని వుండడం సహజమే. అంత మాత్రాన ఆమెను అందరూ అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడదు." అన్నాడు.

"కాని ఈమె స్వోత్కర్ష మితిమీరినది అవటంవల్ల అందరూ ఆమెను తప్పించుక తిరిగేవారు. ఒక చిన్నసంఘటన చెప్తా విను. ఒకనాడు మధ్యాహ్నం మా యింటికి వచ్చింది. మా హాల్లో కుర్చీలో కూచుంటూనే, "మీకొక మంచి ఆశ్చర్యకరమైన విషయం చెప్పనా?" అంది, మమ్మల్ని వూరిస్తూ. అప్పటికి వారంరోజులనుంచీ మా యింటి వాతావరణం అనేక కారణాల వల్ల నిరుత్సాహంగా వుంది. మా అక్కయ్యకు నాలుగు రోజులనుంచి జ్వరం. మాఅన్నయ్య రెండుసార్లు బి. ఏ. తప్పి, మూడోసారి మళ్లీ కట్టాడు. ఆ రిజల్ట్సు వచ్చేరోజులు కావడం వలన, ఆత్రుతగా, మేమంతా మంచి విషయం కోసం ఎదురు

# సాలెగూడు

చూస్తున్నాం. ఆవిడ మొదలెట్టింది. "మా అబ్బాయి గోపాల్ దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. వాణ్ణి వాళ్ల కాలేజీలో తెగ మెచ్చుకున్నారట. మొన్న వాళ్ల కాలేజీలో జరిగిన పాటల పోటీలో ఫస్టొచ్చాడు." అని వాళ్ల గోపాల్ గురించి ఒకగంట సేపు ఉపన్యాసం ఇచ్చింది. ఆ సమయంలో మా అక్కయ్యని చూడటానికి డాక్టరొచ్చాడు. డాక్టరు గారితో మాట్లాడడానికి మా అమ్మని లేవనియ్యకుండా ఆమె కబుర్లుచెప్పసాగింది. తక్కినవాళ్లంతా వెళ్లి ఆయనతో మాట్లాడాం కాని మా అమ్మ మాత్రం కదలడానికి అవకాశం లేకపోయింది, ఆవిడ దగ్గర మొహమాటంవల్ల. డాక్టరుగారు కొంచెం సేపుండి వెళ్లిపోయారు. తరువాత ఆ వూళ్లోనే వున్న మా చుట్టాలొకరు మా అమ్మతో మాట్లాడాలని వచ్చారు. మా అమ్మకు వాళ్లతో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వాళ్లను కూడా అలా కూర్చోమని "మీ అందరికీ ఆశ్చర్యం కలిగించే విషయం ఒకటి చెప్తాను. మా గోపాల్ దగ్గరికి ప్రిన్సిపాలు వచ్చి, 'నా కన్నా నువ్వే గొప్పవాడవోయ్. నేనంటే కొందరికి ఇష్టం, మరి కొందరికి కయిష్టం. కాని నీ పాటలవల్ల నువ్వు అందరికీ ఇష్టుడవైపోయావు' అన్నారుట చూడండి ఎంత తమాషాగా వుందో." అని ఆవిడ చెప్తూంటే, లోపలి బాధ బయటికి కక్కలేక మా అమ్మా వాళ్ళూ 'వూ' కొడుతూ వుండిపోయారు.




వచ్చిన చుట్టాలు, మా అమ్మతో ఆవిడ కబుర్లు ఎప్పటికీ చాలించక పోయేసరికి వెళ్లిపోయారు. తరువాత మా నాన్నగారు ఇద్దరు స్నేహితులతో భోజనానికి వస్తున్నాననీ ఒకగంటలో వంట చేసి వుంచమని కబురంపారు. అప్పటికీ ఆవిడ కదల్లేదు. మరొక గంట పోయాక కూడా లెక్చరు దంచుతూనే వుంది. మా అందరికీ వళ్లు మండిపోయింది. ఆ పూట మా అమ్మని వంట కూడా చెయ్యనిచ్చేటట్లు లేదు. ఈవిడ ఎలా వదుల్తుందిరా బాబూ అని తెగ బాధపడి పోయాం. చివరికి అదృష్టవశాత్తూ వాళ్లాయన ఇంటి తాళం కోసం రావడం అప్పుడు ఆవిడ మా అమ్మని, "మీరు కబుర్లతో నన్ను ఇక్కడ ఇలా వుంచేస్తే ఎలా?" అని విసుక్కుని, లేచి వాళ్లాయన యింటికి వెళ్లడం జరిగింది. ఆవాళ మా అమ్మని చూస్తే చాలా జాలేసింది. ఆవిడ వెళ్లిన చాలాసేపటి వరకూ తల నొప్పితో బాధపడింది."

కేశవరావు ఒక నిముషం మౌనంగా వూరుకున్నాడు. "కొందరికి తీరని కాంక్షలు ఎన్నో వుంటాయి. వాటిని మాటల ద్వారా తీర్చుకుంటూ వుంటారు సానుభూతి పరులైన శ్రోతలు దొరికినప్పుడు" అన్నాడు. నాకు మాత్రం, వాళ్ల జీవితంలోని విస్తార తను ఇతరులపై వ్యాపింప జేసేవాళ్ళు భర్తృహరి చెప్పిన "వృథా వ్యర్థభంగము కావించెడి" వాళ్ల కోవలోకి వస్తారని అనిపిస్తుంది.

"మీల్సు కావాలా?" అంటూ హోటలు వాడు వచ్చాడు. ఏలూరులో భోజనం చెయ్యాలని ఇద్దరమూ నిశ్చయించుకున్నాం. పై బెర్తులోని వ్యక్తి కూడా ఒక మీల్సు టిక్కట్టు తీసుకున్నాడు. మా పక్క సీట్లలో వున్న ఆడపిల్లలు మీల్సు గురించి ఏవో ప్రశ్నలు వేస్తున్నారు. రైలు వేగం అంత హెచ్చుగా లేదు. కామాక్షమ్మగారి గురించి అనేక ఆలోచనలు నాలో చెలరేగాయి. అవన్నీ కేశవరావుతో చెప్పా లనిపించింది. "ఆవిడ ఎప్పుడూ సంఘంలో గొప్పదాన్నని అనిపించుకోవాలని తెగ తాపత్రయ పడేది. తను అందుకు నిరంతరం కృషి చెయ్యడమే కాకుండా, తన కుటుంబంలో అందరూ అదే ఆశయంతో వుండాలని శాసించేది. తన పిల్లలు క్లాసులో ఫస్టు మార్కు తెచ్చుకోకపోతే

వాళ్లని యింట్లో చావగొట్టేసేది. అలా చెయ్యబట్టే వాళ్ల పెద్దబ్బాయి దివాకరం ఇంట్లోంచి పారిపోయాడు.''

''పారిపోయాడా?'' అన్నాడు కేశవరావు ఆశ్చర్యంతో.

''అవును. అతను ఇంటర్మీడియట్ ఫస్టు క్లాసులో పాసవ లేదని రిజల్ట్సు వచ్చిన రోజున కర్ర పుచ్చుకు వాలుగుదెబ్బలు వేసిందట. అతను ఫస్టుక్లాసులో పాసయి ఇంజనీరింగు చదవాలని ఆవిడ ఆశయం. అది నెరవేరక పోయేసరికి కోపంతో ఒళ్లు మర్చిపోయింది. దివాకరం ఆత్మాభిమానంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పారిపోయాడు.

''తరువాత ఏం చేశాడు?''

''అతను మళ్లీ పదేళ్ల దాకా ఇంటికి రాలేదు. తరువాత కలకత్తాలో వ్యాపారం చేసి డబ్బు బాగా సంపాదించాడనుకో కాని ఆవిడ ప్రతి విషయంలోనూ అంత కఠినంగా వుండేది. ఇంట్లో పని మనుషుల్నీ వంట మనిషినీ కూడా అలాగే హింసించేది. పనిమనుషులు వళ్లు వంచి పని చెయ్యకపోతే వాళ్లని తెగ తిట్టేసేది. ఇంట్లో వస్తువుల్ని సర్దటంలో ఏమాత్రం అశ్రద్ధ చూపించినా, పనిలో ఏమాత్రం శుభ్రత తక్కువైనా ఆ పనిమనిషిని వెంటనే తీసేసేది. వంటమనిషిని కూడా అలాగే హింసించేది. నలుగురు వాళ్లింటికి వచ్చినప్పుడు, కాఫీ బాగుండకపోయినా, వంట సరిగా లేకపోయినా, నలుగురిలోనూ ఆవిణ్ణి తిట్టుకు తిట్టేసేది. పాపం ఆ వంట మనిషి తలవంచుకుని వూరుకునేది గాని ఎదురు జవాబిచ్చేది కాదు. ఆవిణ్ణి చూస్తే మా అందరికీ జాలేసేది. ఆవిడ పేరు కోపమ్మ. పొడుగ్గా, సన్నగా కొంచెం వంగిన నడుముతో, కళ్లజోడుతో, మాసిపోయిన చీరతో తిరిగే ఆవిడ రూపం మాకందరికీ పరిచయమే.'' ''తరుచూ అమ్మగారికోపానికి ఆవిడ ఆహుతి అవుతూంటుందనీ, అయినా ఓర్పుతో అలా భరించుకు వస్తోందని పని మనుషులనే వారుట మా అమ్మతో. పని మనిషులెంతో మంది మారారు కాని వంట మనిషి మాత్రం మారలేదు. కారణం మాకు దురూహ్యంగా వుండేది.''

''చాలా కఠినాత్మురాలిలా వుంది.''

''ఒకొక్కప్పుడు ఆవిడ చర్యలు చాలా చిరాకు కల్గించేవి. ముఖ్యంగా ఆవిడకున్న 'సుపీరియారిటీ కాంప్లెక్సు' మమ్మల్ని చాలా ఇరుకులో పెట్టేది. ఎప్పుడూ మాకు ఆశ్చర్యం కలిగించే విషయం చెప్తానంటూ, తనొక గొప్పవంశం లోంచి వచ్చాననీ, తన తండ్రిగారూ, తాతగారూ, నిరతాన్న ప్రదాతలూ, అగ్రహారీకులూ, కాబట్టి అందరూ తన కెంతో గౌరవ మివ్వాలన్నట్లు మాట్లాడేది. ఆమెను దురదృష్టవశాత్తూ సుదర్శనంగారి కిచ్చి పెళ్లి చేశారుట. లేకపోతే ఎంతోమంది జమీందారుల బిడ్డలు ఆమెను పెళ్లాడుతామంటూ వచ్చారుట ఆవిడలో ఆ కీలి వుంది. కాని ఆమెను ఎప్పుడూ, గొప్పగా గౌరవం చూస్తూంటే, ఎప్పుడూ ఆమె గొప్పలే వింటూ, ఆవిడ సంతానం గురించీ ఆమె భర్త గురించీ తెలుసుకుంటూంటే, మన వ్యక్తిత్వం ఏమీ లేనట్లు, మనం వూరికే 'డమ్మీ'లమైనట్లు ఫీలవుతాం.''

''ఇతరులను గౌరవంగా చూడడం ఆవిడకు తెలియదా?'' అని అడిగాడు కేశవరావు.


''తన కన్నా ఎక్కువ భాగ్యవంతులైతే తప్ప ఆమె గౌరవంగా చూడదు. వాళ్లింటికి ఎవరైనా వస్తే, వాళ్లు సామాన్యులైతే చాప వేసి కూచో బెట్టేది, కాని సోఫాల మీద కూర్చోనిచ్చేది కాదు. సోఫాల మీద తెల్లని తొడుగుల్ని అందంగా వేసి, వాటిని మాసి పోనీకుండా వుంచేది. ఎవరైనా వాటి మీద కూచుంటే, వట్టి కాళ్లతో తొక్కి పాడు చేస్తారేమోనని భయం. పిల్లల్ని తీసుకుని ఎవరైనా వాళ్లింటికి వెళ్తే ఆ పిల్లలు వాళ్లింట్లో ఏ వస్తువూ ముట్టుకో కూడదనడం, అల్లరి చేస్తే వాళ్లని కోప్పడడంలాంటి కష్టం కలిగి ఎవరూ రెండోసారి వాళ్లింటికి వెళ్లే వారు కారు''. ఒక్క కఠిన వాక్కుతో నూరు హృదయాలు ముక్కలు చెయ్యొచ్చు, ఒక్క మంచిమాటతో నూరు మహా మందిరాలలో జ్యోతి వెలిగించచ్చు.

మనుషులకు తమ వస్తువుల మీదున్న మక్కువ విచిత్రమైనది. కేశవరావు, ''కొందరు వాళ్ల ఇంటి శుభ్రత కిచ్చే ప్రాధాన్యత వాళ్ల హృదయనైర్మల్యానికి గాని, ఎదుటి వారి మనోభావాలకు గాని ఇవ్వరు.'' అన్నాడు.

''అటు వంటామె, నేను శారదకు తగిన వరుణ్ణి కాదని నిశ్చయించటంలో వింతేమీ లేదనుకుంటాను.'' అన్నాను.

రైలు ఎందుకో ఆగింది. అది స్టేషను కాదు. బహుశా సిగ్నలిచ్చి వుండరు. పెట్టెలోని ప్రయాణీకులంతా కిటికీల్లోంచి తలలు బయటకు పెట్టి చూస్తున్నారు. నేనూ కేశవరావు కదలలేదు. అతను కొద్ది సెకనులు కళ్లు మూసుకున్నాడు. తరువాత కళ్లు తెరచి మాట్లాడాడు. ''అహంభావం మానవుణ్ణి లొంగ దీసినట్లు మరేదీ లొంగదియ్యలేదు. ప్రేమ ప్రభావాన్నైనా తొలగించుకొనవచ్చు గాని అహంభావం యొక్క సంకెలను విడిపించుకొనలేము. ప్రేమలో విఫలత నొందితే, కాలం అనే మంద మంద శీతలవాయు స్పర్శతో ఆ హృదయాగ్ని చల్లార్చుకోవచ్చును కాని అహంభావం దెబ్బ తింటే కలిగే బాధ మరణంతో గానిపోదు. అదే జీవితానికి ఆధారం.''

రైలు — బయల్దేరింది. [ కేశవరావు



మాటలు నిజమే ననిపించింది. ప్రేమ చాలా గొప్పదనుకుంటాం, ప్రపంచంలో. ప్రేమించిన వ్యక్తి కోసం ఏ త్యాగమైనా చెయ్యాలనుకుంటాం. కాని పవిత్ర ప్రేమ అంటే నువ్వు ప్రేమించిన వ్యక్తిలో నువ్వు లయమైపోవాలి. అది అనుభవంలో చాలా కష్టం. అహంభావం అందుకు అడ్డొస్తుంది. తనని తను ప్రేమించుకున్నంతగా మరొక వ్యక్తిని ప్రేమించ లేకపోవడం మానవ స్వభావం.

"కాని చివరికి ఆవిడకు అన్నీ ఎదురు తిరుగుతాయి. పెద్దకొడుకు దివాకరం తనకు దూరమయ్యాడు. రెండో కొడుకు గోపాల్ పెద్ద ఇంజనీరయ్యాడు గాని అతని వివాహం ఒక సమస్య యింది. అతనికి ఎన్ని సంబంధాలో వచ్చాయిగాని ఒక్కటీ ఆమెకు నచ్చలేదు. డబ్బూ, అందం, హోదా, అన్నీ వున్న సంబంధం కావాలి. ఇవేకాక అసలు ఆమెను జీవితాంతం వేధించిన విషయం భర్త పేకాట. సుదర్శనంగారు రోజూ క్లబ్బులో పేకాడేవారు. ఆమె కదొక బెంగ ఎప్పుడూ బాధించేది. ఒకసారి ఆమెకు గుండెపోటు వచ్చింది. డాక్టరు అది చాలా ప్రమాదకరమైనదని చెప్పాడు. అది తగ్గి ఆమె కోలుకుంటూంటే దివాకరం వ్యాపారంలో దివాలా తీసి కలకత్తా నుంచి ఎక్కడికో వెళ్ళిపోయాడని తెలిసింది. దాంతో ఆవిడ జబ్బు మళ్ళీ తిరగబెట్టింది. ఆ సమయంలో డాక్టరు ఆవిడకు మానసిక విశ్రాంతి కావాలన్నాడు. అది ఎలా సాధ్యం? పెద్దకొడుకు వ్యాపారంలో దివాలా తీశాడు, రెండో కొడుక్కి పెళ్ళి కాలేదు. భర్త ఇంటి సంగతి పట్టించుకోకుండా రాత్రింబగళ్ళు క్లబ్బులో పేకాడేవాడు. కూతురు, ఎక్కడో దూరదేశంలో చదువుకుంటోంది. చివరికి నా అన్న వాళ్ళెవరూ దగ్గరలేక బాధపడి బాధపడి మరీ కన్ను మూసింది ఒకనాటి రాత్రి" అన్నాను. కేశవరావు నిట్టూర్చాడు.

రైలు ఏలూరు స్టేషనులో ఆగింది. ఇద్దరం భోజనం చేసి వచ్చాం. కేశవరావు ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు. పై బెర్తులో వ్యక్తి భోజనానికి వెళ్ళివచ్చి కేశవరావు బెర్తు మీద విశ్రాంతి కోసం కూర్చున్నాడు. అతను నాతో మాట్లాడా లనుకుంటున్నాడని గ్రహించాను. నేనే అడిగాను.

"ఏవూరు వెళ్తున్నారు?" అన్నాను.

"బెజవాడ వెళ్తున్నాను. ప్లీడరు సుదర్శనంగారు మీకు బాగా పరిచయమున్నట్లనుకుంటాను." అన్నాడతను.

"మీకెలా తెలుసు?"

"ఆయన భార్య మా పెత్తల్లి" అని అతననేసరికి, నాకు కొంచెం సిగ్గనిపించింది. ఏమనాలో తోచలేదు. "మా అమ్మగారిని మీరు చూసే వుంటారు." అన్నాడు మళ్ళీ.

"నా కసలు కామాక్షమ్మగారికి చెల్లెలున్నట్లే తెలియద"న్నాను.

"మా అమ్మ ఆ యింట్లో వంట మనిషిగా వుండేది."

"కోనమ్మగారా?" అన్నాను చటుక్కున. అతను అవును అనేసరికి నాకు షాక్ తిన్నట్లయింది. తరువాత నా ప్రశ్నలకు సమాధానంగా అతను యదార్థ గాథను చెప్పుకొచ్చాడు. "వాళ్ళిద్దరూ ఒకే తల్లి బిడ్డలు. ఆవిడ అదృష్టం కొద్దీ ప్లీడరుగారి భార్య అయింది. మా అమ్మని ఒక కాఫీ హోటలు సర్వరు కిచ్చి పెళ్ళి చేశారు. నేను పుట్టిన ఆరునెలలకు మా నాన్నగారు పోయారు. మా అమ్మ ఆయిల్లూ, ఆయిల్లూ తిరిగి నన్ను మూడేళ్ళ వరకూ పెంచింది. తరువాత వాళ్ళక్క వద్దకు వెళ్ళి తలదాచుకునేందుకు అర్థించింది. ఆమెకు ఈమెను తన చెల్లెలని చెప్పుకోవడం నామర్దా. అందుకని తన ఇంటిలో ఒక వంటలక్కగా వుండాలనీ, ఎవరికీ ఎప్పుడూ అసలు విషయం తెలియనివ్వ కూడదని షరతు పెట్టింది. నాకు పదేళ్ళు వచ్చేవరకూ వాళ్ళింట్లో వున్నాను. తరువాత ఒక అనాథ శరణాలయంలో చేర్చారు. అప్పటి నుండి ఏడాది కొకసారి మా అమ్మ వచ్చి నన్ను చూసిపోతూండేది. నేను చాలా తిప్పలు పడి బి. ఏ. వరకూ చదివి పాసయ్యాను. ప్రస్తుతం ఉద్యోగం కూడా చేస్తున్నాను. మా అమ్మని పిల్చుకుపోవాలని బయల్దేరాను."

ఈ హృదయవిదారక గాథ విని కొద్ది నిముషాలు మాట్లాడలేకపోయాను. తరువాత పెద్దకూతురికి మంచి సంబంధం చేసి రెండవ కూతురికి అటువంటిది ఎందుచేత చెయ్యలేకపోయారని అడిగాను.

అతను చెప్పాడు. "అసలు వీళ్ళ తండ్రి అంటే మా తాతగారు చాలా బీదవారు. వ్యాయవారం చేసుకుంటూ బ్రతికేవారు. ఈ ఇద్దరు కూతుళ్ళకీ పెళ్ళి చెయ్యలేక చాలాకాలము వరకూ వూరుకున్నారు. ఒకసారి వారి పెద్దకూతుర్ని ఆమె మేనమామల ఇంటికి రాజమండ్రీ పంపారట, వారింట్లో ఏదో పెళ్ళి వస్తే. సుదర్శనంగారి దావూరే. ఆయన తల్లి ఈమెను చూసి, "ఎవరి పిల్ల?" అని అడిగితే వాళ్ళ వాళ్ళమ్మాయి అని చెప్పారట. తండ్రి స్థితిగతులు అడిగితే అసలు విషయం దాచి పొలం మీద రాబడితో కాలక్షేపం చేస్తున్నాడని చెప్పారట. స్థితి పరులు పిల్ల బాగోలునని ఆ పిల్లను చేసుకుంటామన్నారట. పెళ్ళి సమయంలో అసలు విషయం బయటపడింది. ఇక అప్పుడు చేసుకోమంటే బాగుండదని ఉదార హృదయంతో పెళ్ళి జరిపించేసి పిల్లని తమతో తీసుకువెళ్ళిపోయారు. మళ్ళీ ఆ పిల్లను పుట్టింటికి పంపలేదు. అప్పుడు జరిగిన గోలవల్ల రెండో పిల్లకు అసలు పెళ్ళవదేమోనని భయపడి, ఎలాగో ఒక లాగు పెళ్ళి చెయ్యాలని ప్రయత్నం చేసి, ఒక ఏభై ఏళ్ళ రోగిష్టి మనిషి కాఫీ హోటలులో సర్వరు పనిచేసే మా నాన్నగారి కిచ్చి పెళ్ళి చేశారు." అన్నాడు.

నాకు తల తిరిగిపోయింది. తమది చాలా ఉన్నత వంశమనీ, తన తండ్రులూ,తాతలూ గొప్పవారని ఆవిడ ఎన్నోసార్లు చెప్పడం జ్ఞాపకమొచ్చింది. తన చుట్టూ గొప్ప ఆశయాలూ, కోరికలూ అనే సన్నని దారాలతో ఒక గూటిని నిర్మించుకుని, చివరకు అందులోంచి బయటికి వెళ్ళే దారి తెలియక తన వ్యక్తిత్వాన్ని ఆ గూటికి బలి చేసే సాలెపురుగు లాంటిది కొందరి స్వభావం.

రైలు వేగం హెచ్చింది. నాలో చిన్న మగత కమ్మింది. కళ్ళు మూశాను. చిన్న కునుకు పట్టినట్లుంది. అందులో ఒక కల కూడా వచ్చింది. ఆ కలలో కామాక్షమ్మ గారు కన్పించారు. ఆవిడ ఏదో చెప్ప బోతోంది. "నీ కొక ఆశ్చర్యం కలిగించే విషయం చెప్పనా.." అంటోంది. రైలు కుదుపుకు మెలకువ వచ్చింది. ఆమె జీవితమే ఒక ఆశ్చర్యకరమైన విషయం. ఆమె యింట్లో వంటలక్కగా వున్నామె, ఆమె చెల్లెలని తెలియడం కన్నా ఆశ్చర్యమేముంది. రైలు బెజవాడ చేరుకుంది. ●